సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 7 । మార్చి । 2025



కోలుకుంటున్న కోడి

బర్డ్‌ఫ్లూ వైరస్ కారణంగా సంక్షోభాన్ని చవిచూసిన పౌల్ట్రీ రంగం మెల్లగా కోలుకుంటోంది. చికెన్ మేళాలతో అపోహలు వీడుతున్నాయి.

8లో ▸



కదం తొక్కిన కోకో రైతులు

కంపెనీలు సిండికేట్‌గా మారి కోకో గింజల ధరలు తగ్గిస్తున్నాయంటూ కోకో రైతులు ఏలూరులో మహాధర్నా నిర్వహించారు.

8లో ▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్రవారం (సాయంత్రం)	సహరి శనివారం (ఉదయం)
భీమవరం	6.17	4.57
నరసాపురం	6.18	4.55
తాడేపల్లిగూడెం	6.13	5.05

న్యూస్‌రీల్

గీత కార్మికులకు 18 మద్యం షాపులు



లాటరీ తీస్తున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో గీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపును లాటరీ పద్ధతి ద్వారా పూర్తిచేసినట్టు జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో 18 మద్యం షాపులకు సంబంధించి లాటరీ ప్రక్రియ నిర్వహించారు. మొత్తం 478 దరఖాస్తులు అందాయని, మొత్తం షాపులకు రెండు నెలల ఫీజు కింద రూ.95,83,333 రుసుం జమచేసి షాపులు కేటాయిస్తామన్నారు. కులాల వారీగా శెట్టిబలిజ 10, గౌడ 5, గౌడ్ 2, శ్రీశయన 1 చొప్పున షాపులు కేటాయించామన్నారు. దరఖాస్తులకు నాన్ రిఫండబుల్ కింద రూ.9.56 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. స్టేషన్ల వారీగా భీమవరంలో 2, తణుకులో 5, తాడేపల్లిగూడెంలో 4, పాలకొల్లులో 2, నరసాపురంలో 3, ఆకివీడులో 2 దుకాణాలు ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. లాటరీ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించామన్నారు. ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కేవీ నాగప్రభుకుమార్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్ఎస్ కుమారేశ్వరన్, సహాయ ఎక్సైజ్ అధికారి ఆర్‌వీ ప్రసాద్‌రెడ్డి, ఎక్సైజ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

20 ఆటోలపై కేసులు

భీమవరం (ప్రకాశంచౌక్): అధిక సంఖ్యలో పిల్లలను తరలించే ఆటోలపై చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వర రావు హెచ్చరించారు. భీమవరంలోని పలు చోట్ల గురువారం స్కూల్ పిల్లలను తరలించే ఆటోలను తనిఖీలు చేశామన్నారు. 12 ఏళ్ల లోపు వయసున్న పిల్లలను ఆరుగురిని మాత్రమే ఎక్కించుకోవాలని, స్కూల్ బ్యాగులు, లంచ్ బాక్స్‌లు ఆటో బయటకు రాకుండా చూసుకోవాలన్నారు. డ్రైవర్‌కు ఇరువైపులా పిల్లలను కూర్చోపెట్టకూడదని, స్కూల్ ట్రిప్ బోర్డును ఎరుపు రంగులో ఆటో ముందు, వెనుక ప్రదర్శించాలని ఆదేశించారు. 20 ఆటోలపై కేసులు నమోదు చేసి, ఒక ఆటోను సీజ్ చేశామన్నారు. మొత్తంగా రూ.75,170 అపరాధ రుసుం వసూలు చేశామని చెప్పారు.

నీటి ఎద్దడి తలెత్తకూడదు

దెందులూరు/ఏలూరు (టూటౌన్): జిల్లాతో తాగు, సాగునీటి సమస్య లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. గురువారం దెందులూరు మార్కెట్ కమిటీ చెక్ పోస్టు సమీపంలో ఏలూరు నగరానికి సాగునీటి సరఫరా చేసే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. దెందులూరు కాలిబాట వంతెన వద్ద ఏలూరు కాల్వలో తూడు తొలగింపు పనులనూ పరిశీలించారు. ఏలూరు కాలువ ద్వారా సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను నీటితో నింపేందుకు పర్యవేక్షణ చేయాలన్నారు. చేపల చెరువులకు అక్రమంగా నీటి మళ్లింపును అరికట్టేలా కాలువ గట్ల వెంబడి పటిష్ట నిఘా ఉంచాలన్నారు. అనంతరం వాటర్ పంప్ హౌస్ వద్ద కలెక్టర్ మొక్క నాటారు. ఏలూరు కాలువలో మూడున్నర అడుగుల మేర నీరు ఉందని ఇరిగేషన్ శాఖ ఎస్ఈ పి.నాగార్జున రావు తెలిపారు. ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, కమిషనర్ భానుప్రతాప్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్ బాషా ఉన్నారు.

'గురుకుల' ప్రవేశాలకు ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ ఫస్టియర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా సమన్వయ అధికారి బి.ఉమాకుమారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపికచేస్తామని, దరఖాస్తుల స్వీకరణకు గడువును ఈనెల 13 వరకు పొడిగించామని పేర్కొన్నారు. వచ్చేనెల 6న ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఏలూరు జిల్లాలో బాలురకు పెదవేగి, చింతలపూడి, బాలికలకు పోలసానిపల్లి, వట్లూరు, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, నూజివీడులో పాఠశాలలు ఉన్నాయన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో బాలురకు ఆరుగొలను, న్యూ ఆరుగొలను, ఎల్‌బీ చర్ల నరసాపురంలో, బాలికలకు పెనుగొండలో పాఠశాలలు ఉన్నాయన్నారు.

కొనసాగిన ఇంటర్ పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు గురువారం గణితం -1ఏ, బోటనీ, సివిక్స్-1 పరీక్షలు జరిగాయి. జిల్లాలో 55 కేంద్రాల్లో 19,400 మంది విద్యార్థులకు 18,195 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.యోహాన్ తెలిపారు. అలాగే ఇంటర్ సంస్కృతం జవాబుపత్రాల మూల్యాంకనం శుక్రవారం నుంచి ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభమవుతుందని చెప్పారు.

తెల్లారిన బతుకులు

తెల్లవారకముందే.. వారి జీవితాలు తెల్లారిపోయాయి. కొద్ది గంటల్లోనే గమ్యస్థానాలకు చేరుకోవాల్సి ఉండగా మృత్యువు వారిని కబళించింది. **అతివేగం, పొగమంచు కారణంతో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుకు ఘోర ప్రమాదం జరిగింది. బస్సు నుంచి కారిన రక్తధారలు భయభ్రాంతులకు గురిచేయగా.. క్షతగాత్రుల హాహాకారాలు మిన్నంటాయి. ఏలూరు జిల్లా ఏలూరులోని చొదిమెళ్ల వద్ద జాతీయరహదారి (ఎన్‌హెచ్-16)పై ఆగి ఉన్న లారీని ట్రావెల్స్ బస్సు** ఢీకొన్న ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందగా.. డ్రైవర్ చికిత్స పొందుతూ కన్నుమూశాడు. బస్సులోని 21 మంది ప్రయాణికులు గాయాలపాలయ్యారు. ఘటనా స్థలిలో బస్సు దెబ్బతిన్న తీరు చూస్తే ప్రమాద తీవ్రత అర్థమవుతుంది.

డెడ్లీ జర్నీ

- ఏలూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- వేకువజామున ఘటన
- లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు
- ఘటనా స్థలంలో ముగ్గురు, చికిత్స పొందుతూ మరొకరు మృతి
- 21 మందికి గాయాలు



బస్సులో ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటకు తీస్తున్న దృశ్యం, (ఇన్‌సెట్‌లో) క్రేన్ సాయంతో బస్సును పక్కకు తీస్తూ..

ఏలూరు రూరల్: ఏలూరులోని చొదిమెళ్ల వద్ద రత్నాస్ హోటల్ సమీపంలో విజయవాడ నుంచి రాజమండ్రి వెళుతున్న సిమెంట్ లారీ (ఏపీటీ 91ఏ 1769) మరమ్మతుల కారణంగా నిలిచిపోయింది. గురువారం వేకువజామున 5 గంటల సమయంలో రమణ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు (ఎన్ఎల్ 01బీ 3092) హైదరాబాద్ నుంచి కాకినాడ వెళుతుండగా వేగంగా నడుపుతున్న బస్సు డ్రైవర్ రోడ్డు పక్కన ఆగి ఉన్న సిమెంట్ లారీని గుర్తించలేకపోయాడు. చివరి నిమిషంలో బస్సును తప్పించేందుకు ప్రయత్నించగా లారీ వెనుక భాగాన్ని ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. బస్సులో కండక్టర్ వైపు భాగం చీల్చుకుంటూ వెళ్లి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో బస్సులో నిద్రిస్తున్న ప్రయాణికులు ఒక్కసారిగా కేకలు వేశారు. ప్రమాదంతో ఉలిక్కిపడిన స్థానికులు, ఇతర వాహనాల డ్రైవర్లు హుటాహుటిన వచ్చి ప్రయాణికులను రక్షించేందుకు ప్రయత్నించారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు సైతం ఘటనా స్థలానికి చేరుకుని బస్సులో చిక్కుకుపోయిన వారిని బయటకు తీసుకువచ్చారు. క్షతగాత్రులను 108లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనా స్థలం రక్తసిక్తం కాగా.. పరిసరాల్లో బస్సులోని విడి భాగాలు చెల్లాచెదురుగా పడ్డాయి.

శకలాల మధ్య ఇరుక్కుపోయి..

బస్సులో కండక్టర్ సీటు వైపు కూర్చున్న మహిళలు మొటపర్తి భవాని, జుత్తిగ భవాని, పురుషుడు బొంతు భీమేశ్వరరావు శకలాల్లో చిక్కుకుపోయారు. లారీ డ్రైవర్ మధు సైతం స్టీరింగ్ వద్ద ఇరుక్కుపోయాడు. పోలీసులు క్రేన్ సాయంతో బస్సును లేపి పక్కకు చేర్చారు. శకలాలను తప్పించి ముగ్గురు ప్రయాణికులతో పాటు డ్రైవర్‌ను అంబులెన్స్ ద్వారా ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ప్రయాణికులు ముగ్గురు మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. డ్రైవర్ మధుకు అత్యవసర చికిత్స అందించగా నాలుగు గంటల పాటు మృత్యువుతో పోరాడి కన్నుమూశాడు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం చేయించారు.

అతి వేగం.. పొగ మంచు



డ్రైవర్ మధు మృతదేహం

అతివేగం, పొగమంచు ప్రమాదానికి కారణమని స్థానికులు భావిస్తున్నారు. వేకువజామున పొగమంచు కురవడంతో బస్సు డ్రైవర్ ఆగి ఉన్న లారీని గుర్తించలేకపోయాడు. మరోపక్క లారీ డ్రైవర్ లారీని జాతీయరహదారి పక్కన నిలపడం ప్రమాదానికి కారణంగా చెబుతున్నారు. ఘటనా స్థలానికి 30 మీటర్ల దూరంలో పార్కింగ్ రోడ్డు ఉందని, జాతీయరహదారిపై ఎక్కడిపడితే అక్కడ వాహనాలను నిలుపుదల చేయడం ప్రమాదాలకు కారణమవుతున్నాయని చెబుతున్నారు. డ్రైవర్లు వాహనాలను పార్కింగ్ స్థలాల్లోనే నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నైట్ పెట్రోలింగ్ నామమాత్రం

దెందులూరు: భీమడోలు నుంచి హనుమాన్ జంక్షన్ వరకు జాతీయ రహదారి (ఎన్‌హెచ్-16) మృత్యుమార్గంగా మారింది. ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. కాగా నైట్ పెట్రోలింగ్ తూతూమంత్రంగా జరుగుతుండటం విమర్శలకు తావిస్తోంది. రాత్రి వేళ పెట్రోలింగ్‌కు సిబ్బంది, వాహనాలు ఉన్నా పూర్తిస్థాయిలో జరగడం లేదు. ఈ వాహనమైనా రాత్రి వేళ హైవేపై నిలిచిపోతే హైవే పోలీసులకు సమాచారం ఇచ్చే అవకాశం ఉండటం లేదు. అలాగే పెట్రోలింగ్ పోలీసులు నిత్యం పెట్రోలింగ్ చేయడం ద్వారా కొంతవరకు ప్రమాదాలను నివారించవచ్చని డ్రైవర్లు అంటున్నారు. వారంలో ఒక్కరోజైనా సీఐ స్థాయి నుంచి పై స్థాయి అధికారి రాత్రిళ్లు పెట్రోలింగ్‌పై తనిఖీలు చేయాలని అంటున్నారు. ప్రమాదాలు ఎక్కువగా రాత్రి 12.30 నుంచి వేకువజామున 5 గంటలలోపు జరుగుతున్నాయి.

ప్రతిపాదనలకే షెల్టర్ పరిమితం

లారీలు, భారీ వాహనాల నిలుపుదల, డ్రైవర్ల విశ్రాంతికి జాతీయరహదారిపై కలపర్రు నుంచి భీమడోలు వరకు ఎలాంటి సౌకర్యాలు, స్థలం లేవు. గతంలో స్థలం కోసం గుండుగొలను వద్ద కలెక్టర్ పరిశీలన చేశారు. అక్కడ షెల్టర్ నిర్మించాలని ప్రతిపాదనలు చేసినా ఒక్క అడుగూ ముందుకు పడలేదు. దెందులూరు నియోజకవర్గంలో డ్రైవర్ల విశ్రాంతి, వాహనాల నిలుపుదలకు కనీసం పది ఎకరాల్లో షెల్టర్ ఏర్పాటు చేయాలని చాలాకాలంగా డ్రైవర్లు కోరుతున్నారు. ఇక్కడ ప్రమాదాల నివారణకు షెల్టర్ దోహదపడుతుందని వాహనాల డ్రైవర్లు అంటున్నారు.

జాతరకు వస్తూ..



మృతుడు బొంతు భీమేశ్వరరావు భీమడోలుకు చెందినవారు. పెయింటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వృత్తిరీత్యా ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న ఆయన సొంతూరులో జరిగే జాతరకు హైదరాబాద్ నుంచి వస్తున్నారు. మరో 20 నిమిషాల్లో సొంతూరుకు చేరుకుంటారనుకున్న సమయంలో మృత్యువు కబళించింది. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారి కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ భవాని



మృతురాలు మొటపర్తి భవానిది కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం కాట్రవారిపాలెం. ఆమె హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. కుటుంబసభ్యులను చూసేందుకు వచ్చి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. భవానీ అకాల మరణం ఆ కుటుంబంలో తీరని శోకం నింపింది.

బంధువుల ఇంటికి వెళ్లి వస్తూ..



మృతురాలు జుత్తిగ భవాని గృహిణి. ఆమెది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కోలంక గ్రామం. బంధువుల ఇంటికి వెళ్లి వస్తున్న సమయంలో ఆమె ప్రమాదంలో కన్నుమూసింది. ఆమె కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది. మృతుడు డ్రైవర్ మధు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

క్షతగాత్రులు వీరే..

ప్రమాదంలో గాయాలపాలైన వారిలో కోలా సురేఖ, కోలా రాజాబాబు, కోలా లిఖిత, వనమనీడి ఆదిలక్ష్మి, మద్దాల కీర్తి, మాచర్ల సుజాత, మండపాక బాలాజీ, మండపాక శ్రీదేవి, మండపాక హరిణి, మండపాక శశిరేఖ, ఆర్నాలకంటి శ్రీలక్ష్మి, కోట వేణి, పువ్వుల శ్యామ్‌కుమార్, శీలం ప్రకాష్, ఎం.ప్రతాప్, పి.అక్కమ్మ, పి.హేమలత, గోణజ విజయకుమార్, రామిశెట్టి సోమసత్యనారాయణ, టి.రవికుమార్, జి.మణికంఠ (క్లీనర్) ఉన్నారు. అధికారులు క్షతగాత్రులకు చికిత్స చేయించి వారి గమ్యస్థానాలకు పంపించారు. క్షతగాత్రులు పాలకొల్లు, రాజమండ్రి, కాకినాడ ప్రాంతాలకు చెందిన వారిగా గుర్తించారు.



బోల్తా కొట్టి నుజ్జయిన ట్రావెల్స్ బస్సు



ఏలూరులో చొదిమెళ్ల వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యం



డివైడర్‌లో ఎగిరిపడ్డ బస్సులోని సీట్లు

పోలీసులే కొట్టి చంపారు..!

- చోరీ కేసులో 16 ఏళ్ల బాలుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- మూడు రోజుల తర్వాత విగతజీవిగా గుర్తింపు



అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన యశ్వంత్



రోదిస్తున్న తల్లి వనిత

సాక్షి, టాస్క్‌ఫోర్స్: 'బండి చోరీ కేసు అంటూ.. మూడు రోజుల క్రితం మా అబ్బాయిని పోలీసులు తీసుకువెళ్లారు.. నిన్న స్టేషన్‌కు వెళ్లాను.. ఒక్కసారైనా మా అబ్బాయి ముఖం చూపించండయ్యా అని పోలీసుల కాళ్లు పట్టుకుని బతిమిలాడాను.. ఏమీ లేదమ్మా.. రేపు ఇంటికి వచ్చేస్తాడు అన్నారు.. వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, హనుమాన్ జంక్షన్ పోలీస్‌స్టేషన్లల్లో ఉన్నాడని తలో మాట చెప్పారు.. ఈరోజు చూస్తే జీజీహెచ్‌లో శవమై కనిపించాడు' అంటూ బాలుడి తల్లి వనిత బోరున విలపించింది. పదో తరగతి విద్యార్థి (16) ఒంటిపై, అరికాళ్లపై దెబ్బలతో అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం ఏలూరులో తీవ్ర సంచలనంగా మారింది.

అసలేం జరిగిందంటే..

ఏలూరులోని చేపలతూము ప్రాంతానికి చెందిన బంగారు శివ చింతలపూడిలోని విద్యాశాఖలో అటెండర్‌గా పనిచేస్తున్నారు. శివ చిన్న కుమారుడు యశ్వంత్‌కుమార్ (16) ఏలూరులోని ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం ఏలూరు సీసీఎస్ పోలీసులు బండి చోరీ కేసులో రికవరీల కోసమని యశ్వంత్‌తో పాటు మరో ఆరుగురు పిల్లలను తీసుకువెళ్లారు. అయితే వారిని సీసీఎస్ స్టేషన్‌లో కాకుండా వేరే ప్రాంతంలో ఉంచి విచారించారు. ఈ నేపథ్యంలో తన కుమారుడి కోసం యశ్వంత్ తల్లి వనిత రెండు రోజులుగా పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదు. ఈ క్రమంలో గురువారం వేకువజామున 5 గంటల సమయంలో పెదవేగి మండలం మొండూరు ప్రాంతంలో గోదావరి కుడికాల్వ గట్టుపై యశ్వంత్ అపస్మారక స్థితిలో పడి ఉండగా.. గుర్తించి ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. అయితే బాలుడు అప్పటికే మృతి చెందడంతో మార్చురీలో పెట్టి కనీసం కుటుంబ సభ్యులకు కూడా పోలీసులు సమాచారం ఇవ్వలేదు.

మార్చురీ వద్ద ఆందోళన

మార్చురీ సిబ్బంది ద్వారా యశ్వంత్ మృతి వార్త తెలిసిన తల్లిదండ్రులు శివ, వనిత, సోదరుడు కృష్ణవర్ధన్ బంధువులతో కలిసి జీజీహెచ్‌కు వచ్చారు. యశ్వంత్ మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. అరికాళ్ల నుంచి ఛాతీ వరకూ తీవ్ర గాయాలయ్యేలా నిర్దాక్షిణ్యంగా పోలీసులే కొట్టి చంపేసి, శవాన్ని ఎక్కడో పడేశారంటూ విలపించారు. తమ కుమారుడి మృతికి న్యాయం చేయాలంటూ మార్చురీ వద్ద బైఠాయించి దీనిపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామని ఆందోళనకు దిగారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

చొదిమెళ్లలో జరిగిన బస్సు ప్రమాద బాధితులను పరామర్శించడానికి కలెక్టర్ వెట్రిసెల్వి జీజీహెచ్‌కు రాగా ఆమెను కలిసి యశ్వంత్ మృతిపై ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీతో మాట్లాడి విచారణకు ఆదేశించి న్యాయం చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

భిన్నంగా పెదవేగిలో ఫిర్యాదు

ఇదిలా ఉండగా పెదవేగి పోలీస్‌స్టేషన్‌లో భిన్నంగా ఫిర్యాదు నమోదైంది. పోలీసులు, చోటా నేతల ఒత్తిళ్లతో యశ్వంత్ సోదరుడు కృష్ణవర్ధన్‌తో పెదవేగి పోలీసులు ఫిర్యాదు తీసుకున్నారు. ఈనెల 5న తన సోదరుడు ఇంటి నుంచి బయటకు వెళ్లాడని, 6న మొండూరు కాల్వ గట్టుపై అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పెదవేగి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాలుడిని జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతిచెందాడని, మార్చురీకి తరలించి తమకు సమాచారం ఇచ్చారని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అబద్ధాలకు కేరాఫ్ చంద్రబాబు

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకు అర్బన్: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చామని, ఉచిత బస్సులు తిరుగుతున్నాయని జాతీయ మీడియాలో ముఖ్యమంత్రి చంద్రబాబు బాకా ఊదుతున్నారని, ఆయన మాదిరిగానే ఎమ్మెల్యేలంతా అబద్ధాలు చెబుతూ కాలం గడిపేస్తున్నారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. తణుకులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియాలో కూటమి బండారాన్ని ఉతికారేస్తున్నారని చెప్పారు. 'బస్సులు మా ఇంటికి వచ్చి ఎక్కించుకుంటున్నాయని.. గ్యాస్ సిలిండర్లు బుక్ చేయకుండానే ఇంటికి ఉచితంగా వచ్చేస్తున్నాయని.. రూ.15 వేలు మా ఇంట్లో అందరికీ అందేశాయని..' కూటమి ఘనకార్యాలను ప్రజలు గొప్పగా వెటకారాలు చేస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో దారుణ పరిస్థితులు కనిపిస్తున్నాయని, మద్యం ఇంటికి సరఫరా చేసే పరిస్థితి నెలకొందని, కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఫ్లైఓవర్ల నిర్మాణం కోసం తణుకులో రాజమండ్రి మాజీ ఎంపీ భరత్ ప్రతిష్టాత్మకంగా తీసుకుని శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత అవి మూలనపడ్డాయని విమర్శించారు. 2019 నుంచి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపామని, సన్న బియ్యం అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజలకు మేలు చేశామని తెలిపారు. తమ హయాంలో విజిలెన్స్ దాడుల్లో పట్టుబడిన బియ్యాన్ని అదే నెలలో ఎక్కువ ధరలకు విక్రయాలు చేసి ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చామని గుర్తుచేశారు. నేడు మరలా రేషన్ బియ్యం అక్రమ మార్గంలో తరలిస్తున్నారంటే అదంతా కూటమి ప్రభుత్వ దయేనని అన్నారు. రాష్ట్రంలో చెత్త కుప్పలు పేరుకున్న విషయాన్ని నేడు ఎల్లోమీడియా పత్రికలోనే వస్తుండటం చూస్తున్నామని గుర్తుచేశారు. చెత్త, మద్యం విక్రయాలపై ఎన్నికల హయాంలో తణుకు ఎమ్మెల్యే టిక్‌టాక్‌లు చేశారని, సంక్రాంతి వచ్చేప్పటికీ అన్ని రహదారులు వేస్తామని బింకాలు పోయారని, అయితే ప్యాచ్ వర్కులతో సరిపెట్టారని కారుమూరి దుయ్యబట్టారు.

బాలుడి మృతిపై విచారణకు డిమాండ్

ఏలూరు (టూటౌన్): చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులకు ప్రజల ప్రాణాలకు ముప్పుతెచ్చే హక్కులేదని, తప్పు చేసిన వారిని న్యాయస్థానం ముందు నిలబెట్టి శిక్షించాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. తమ బిడ్డను పోలీసులే చంపేశారంటూ ఏలూరులోని తంగేళ్లమూడిలో నివాసముంటున్న యశ్వంత్ అనే బాలుడు కుటుంబసభ్యులు ఏలూరులో ఆస్పత్రి వద్ద గురువారం ఆరోపణ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. యశ్వంత్ మృతికి పోలీసులే కారణమైతే బాధాకరమని, సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం కార్యదర్శి రవి డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ఆకివీడు: లారీ ఢీకొని మోటార్‌సైక్లిస్టు మృతి చెందిన ఘటన ఆకివీడులో చోటుచేసుకుంది. కైకలూరు నియోజకవర్గంలోని పెదకొట్టాడ గ్రామానికి చెందిన మద్దా మరియదాసు (38) ఆకివీడులో ఫిష్‌ప్యాకింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి ఫిష్‌ప్యాకింగ్ పనులు ముగించుకుని మోటారు సైకిల్‌పై తిరిగి ఇంటికి వెళుతుండగా స్థానిక ఎఫ్‌సీఐ గోడౌన్ సమీపంలో కైకలూరు నుంచి వేగంగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మరియదాసు తలకు తీవ్ర గాయమవడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై హనుమంతు నాగరాజు చెప్పారు. దాసుకు భార్య, ముగ్గురు మగపిల్లలు ఉన్నారని, అతడి భార్య విదేశాల్లో ఉంటున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దాసు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించామన్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెంలోని కరూర్ వైశ్యాబ్యాంక్ ఏటీఎంలో చోరీకి విఫల యత్నం చేసిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కరూర్ వైశ్యాబ్యాంక్‌కు చెందిన ఏటీఎంలో చోరీకి పాల్పడేందుకు యత్నించారు. ముందుగా ఏటీఎం గదిలోకి ప్రవేశించేందుకు అక్కడ ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించగా సాధ్యం కాకపోవడంతో అక్కడి నుంచి పరారయ్యారు. గురువారం ఉదయం బ్యాంకు సిబ్బంది వచ్చి పరిశీలించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ ఎ.సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

అత్తిలి: దంతుపల్లిలో జరిగిన హత్యకేసులో నిందితుడు కడలి వెంకట నారాయణను తణుకు రూరల్ సీఐ బి కృష్ణకుమార్ అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చారని ఎస్సై పి ప్రేమరాజు గురువారం తెలిపారు. దంతుపల్లి గ్రామంలో జుత్తిగ వీరాంజనేయులను రాయితో కొట్టి హత్యచేసిన వెంకట నారాయణను ఇంటివద్ద అరెస్ట్ చేసి తణుకు కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించారని ఎస్సై చెప్పారు.

ఇంట్లోకి ప్రవేశించి.. కంట్లో కారం కొట్టి

జంగారెడ్డిగూడెం: ఇంట్లోకి ప్రవేశించి, కంట్లో కారం కొట్టి, మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన జంగారెడ్డిగూడెంలో చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెంకు చెందిన భూమా భాస్కరరావు, రత్నావతి స్థానిక బెనర్జీగారి వీధిలోని దుర్గాభవానీ అపార్టుమెంటులో నివాసముంటున్నారు. గురువారం ఉదయం భాస్కరరావు పనిమీద బయటకు వెళ్లగా రత్నావతి ఇంటి వద్ద ఒంటరిగా ఉంది. ఇంట్లో ఆమె టీవీ చూస్తున్న సమయంలో వెనుక నుంచి ఓ అపరిచిత వ్యక్తి ఆమె మెడలోని బంగారు గొలుసు, సూత్రాలను లాక్కుని పరారయ్యాడు. ముఖానికి మాస్కు పెట్టుకుని వచ్చిన దుండగుడు తన జుట్టు పట్టుకుని, తన కళ్లల్లో కారం కొట్టి కట్టర్ సహాయంతో సూత్రాలతో పాటు గొలుసును కత్తిరించుకుపోయాడని బాధితురాలు రత్నావతి కన్నీటిపర్యంతమైంది. విషయం తెలుసుకున్న ఎస్సై జబీర్ ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు.

కోలుకుంటున్న కోడి

- పెరుగుతున్న చికెన్, కోడిగుడ్ల అమ్మకాలు
- జిల్లాలో సక్సెస్ అవుతున్న చికెన్ మేళాలు
- 20 నుంచి 50 శాతానికి పెరిగిన చికెన్ విక్రయాలు



తణుకు చికెన్ మేళాలో క్యూలో నిలబడిన ప్రజలు (ఫైల్)

తణుకు అర్బన్ : బర్డ్‌ఫ్లూ వైరస్ కారణంగా సంక్షోభాన్ని చవిచూసిన పౌల్ట్రీ రంగం ఇప్పుడిప్పుడే మెల్లగా కోలుకుంటోంది. గతనెలలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి బాదంపూడి, తణుకు మండలం వేల్పూరు, పెరవలి మండలం కానూరు గ్రామాల్లో కోళ్ల ఫారాల్లో బర్డ్‌ఫ్లూ పాజిటివ్‌గా రావడంతో ఆయా ప్రాంతాలకు 10 కిలోమీటర్ల మేర చికెన్, కోడిగుడ్లు అమ్మకాలపై నిషేధాజ్ఞలు విధించారు. అయితే బర్డ్‌ఫ్లూ సోకిన దానికంటే కూడా భయంకరంగా జరిగిన ప్రచారం కారణంగా కోళ్లు కొనుగోలు చేసే వారు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కోళ్లకు మేత వేయలేక కొన్ని ప్రాంతాల్లో ఉచితంగా కూడా పంపిణీ చేసినట్లుగా పౌల్ట్రీ ఫెడరేషన్ ఆవేదన వ్యక్తం చేశారు. బర్డ్‌ఫ్లూ మహమ్మారి కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా రూ.100 కోట్లు నష్టపోయామని కేంద్ర పశుసంవర్థక శాఖ బృందానికి పౌల్ట్రీ ఫెడరేషన్ వినతిపత్రం అందజేసింది. తాజాగా బర్డ్‌ఫ్లూ వ్యవహారం తగ్గడంతో చికెన్ మేళాల నిర్వహణ తదితర కారణాలతో చికెన్ అమ్మకాలు కొద్దికొద్దిగా ఆశాజనకంగా మారుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

చికెన్ మేళాలకు ఆదరణ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పౌల్ట్రీ ఫెడరేషన్, జిల్లా కోళ్ల రైతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల కొన్ని ప్రాంతాల్లో చికెన్, ఎగ్ మేళాలు నిర్వహించి ఉచితంగా చికెన్ వంటకాలను ప్రజలకు అందించారు. వీటిని భారీ ఎత్తున ప్రజలు ఆదరించారు. ముఖ్యంగా ఈనెల 5వ తేదీన పౌల్ట్రీ ఫెడరేషన్, పశ్చిమ గోదావరి జిల్లా కోళ్ల రైతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తణుకు నెక్ కల్యాణ మండపంలో నిర్వహించిన చికెన్, ఎగ్ మేళాకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ఇక్కడ 10 వేల మందికి చికెన్, బిర్యానీ వంటకాలను సిద్ధం చేయగా సుమారుగా 13 వేల మందికిపైగా హాజరయ్యారు. మేళాకు హాజరైన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సైతం చికెన్ వంటకాలను వడ్డించి ఆమె స్వయంగా చికెన్ తిన్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు పౌల్ట్రీ ఫెడరేషన్, కోళ్ల రైతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తణుకు, వేల్పూరు, ఏలూరు, భీమవరం ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన చికెన్ మేళాలకు ప్రజలు భారీగానే తరలివచ్చారు.

జిల్లాలో 300 కోళ్ల ఫారాలు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో బాయిలర్ కోళ్లకు సంబంధించి 300 ఫారాలు ఉండగా నిత్యం 22 టన్నులు (22వేలు కిలోలు) బాయిలర్, 15 టన్నులు (15వేల కిలోలు) లేయర్ మాంసం విక్రయాలు జరగ్గా బర్డ్‌ఫ్లూ అనంతరం కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వం విధించిన ఆంక్షలు, అపోహల కారణంగా 20 శాతానికి అమ్మకాలు పడిపోయాయి. ఈనెల 1 నుంచి అమ్మకాలపై ఆంక్షలు తొలగించడంతో చికెన్ తినేందుకు ప్రజానీకం భయపడే పరిస్థితుల్లో తాజాగా చికెన్ మేళాల అనంతరం 50 శాతానికి అమ్మకాలు పెరిగాయని ఉగాది పండుగ వచ్చేసరికి నూరు శాతం అమ్మకాలకు చేరుకోగలమని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కోడిగుడ్లకు సంబంధించి సుమారు 200కు పైగా ఉన్న ఫారాల ద్వారా నిత్యం కోటి ఇరవై లక్షలు కోడిగుడ్లు రోజుకు ఉత్పత్తి చేసే సామర్థ్యం జిల్లాలో ఉన్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా పౌల్ట్రీ రంగానికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పెట్టింది పేరని రైతులు చెబుతున్నారు.

చికెన్ మేళా సక్సెస్



తణుకు నెక్ కల్యాణ మండపంలో నిర్వహించిన చికెన్, ఎగ్ మేళా కార్యక్రమాన్ని ప్రజలు విశేషంగా ఆదరించారు. తక్కువ ధరకు అధిక ప్రొటీన్ పోషకాలు అందించే చికెన్, ఎగ్‌లను ప్రజలు నిరభ్యంతరంగా తీసుకోవచ్చు. అపోహలు తొలగించేందుకే చికెన్ మేళాలు నిర్వహించాం.

– కోమట్లపల్లి వెంకట సుబ్బారావు, ఆంధ్రప్రదేశ్ పౌల్ట్రీ ఫెడరేషన్ చైర్మన్

పుంజుకున్న చికెన్ అమ్మకాలు



వైరస్ ప్రభావం తొలగడంతో ఈనెల 1వ తేదీ నుంచి చికెన్, కోడిగుడ్లు అమ్మకాలపై ఆంక్షలు తొలగించారు. వైరస్ భయంతో 20 శాతానికి పడిపోయిన చికెన్ అమ్మకాలు నేడు తిరిగి పుంజుకుని 50 శాతానికి పెరిగాయి. రానున్న రోజుల్లో వంద శాతానికి పెరుగుతాయి.

– డాక్టర్ కరణం శంకర్ భావనారాయణ, తణుకు మండల పశువైద్యాధికారి

కదం తొక్కిన కోకో రైతులు



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు, రైతు సంఘ నాయకులు

- కలెక్టరేట్ వద్ద రైతుల మహాధర్నా
- కోకో గింజలకు కిలోకు రూ.900 ధర ఇప్పించాలని వినతి
- సిండికేట్‌గా మారిన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ఏలూరు (టూటౌన్) : కంపెనీలు సిండికేట్‌గా మారి కోకో గింజల ధర తగ్గిస్తున్నాయంటూ ఏలూరులో రైతులు కదం తొక్కారు. చలో ఏలూరు కార్యక్రమంలో భాగంగా రైతులు ర్యాలీ, మహాధర్నా చేపట్టారు. ముందుగా ఫైర్‌స్టేషన్ మీదుగా ఉద్యాన శాఖ డీడీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేసి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ధర్నాను ఉద్దేశించి ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కోకో గింజలను అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కిలోకు రూ.900 ధర ఇప్పించాలని, సిండికేట్‌గా మారిన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కంపెనీలతో రైతుల సమక్షంలో చర్చలు జరపాలని లేకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నినాదాలు చేస్తుండగా ఏలూరు త్రీటౌన్ సీఐకి రైతు సంఘ నాయకులతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. శాంతియుతంగా ధర్నా చేస్తున్న తమపై పోలీసులు దురుసుగా ప్రవర్తించడం తగదని నాయకులు విమర్శించారు. వినతి పత్రం అందుకున్న కలెక్టర్ వెట్రిసెల్వి రైతులతో చర్చలు జరిపి వారి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. ఏపీ కోకో రైతు సంఘం నాయకులు బొల్లు రామకృష్ణ, ఎస్.గోపాలకృష్ణ, సంఘ నాయకులు ఏలూరుతో పాటు పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, ఎన్టీ ఆర్, కృష్ణా జిల్లాల రైతులు భారీగా తరలివచ్చారు.

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

ఎస్పీ అద్నాన్ నయీం అస్మి



పోలీసు అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం (ప్రకాశం చౌక్): నిర్దిష్ట ప్రణాళికతో పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పోలీసు అధికారులతో గురువారం ఆయన నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనాల కట్టడితో పాటు చోరీ సొత్తు రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దర్యాప్తులో వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంటూ నేర నియంత్రణలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ముమ్మరం చేసి చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ల వారీగా పాత పెండింగ్ కేసుల వివరాలు, ప్రస్తుత కేసుల స్థితిగతులు, నమోదైన కేసుల్లో నేరస్తుల అరెస్టు, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై సంబంధిత పోలీస్ అధికారులను ఆరా తీశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, రాత్రి సమయంలో రెగ్యులర్ బీట్లతో వాహనాల తనిఖీలు చేసి కట్టడి చేయాలని, నేర నియంత్రణకు విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వాహన తనిఖీలు చేపట్టి ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించేలా చేయాలన్నారు. అలాగే జిల్లాలో గుర్తుతెలియని మృతదేహాలు, అనుమానాస్పద మృతి కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయా కేసుల్లో అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి పూర్తిస్థాయిలో సాక్ష్యాధారాలు సేకరించాలన్నారు. గ్రామాల్లో ఎంట్రీ, ఎగ్జిట్ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చూడాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని పాటించాలన్నారు. ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలగాలని, జవాబుదారీగా ఉండాలని, మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఏఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, భీమవరం సబ్ డివిజన్ డీఎస్పీ రావూరి గణేష్ జయసూర్య, నరసాపురం డీఎస్పీ జి.శ్రీ వేద, తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ డీఎస్పీ డి.విశ్వనాథ్, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వరరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో అక్రమ తవ్వకాలు

- జి.కొత్తపల్లిలో దర్జాగా పచ్చ ముఠా దందా
- రియల్ ఎస్టేట్ వెంచర్లకు టిప్పర్ల ద్వారా తరలిపోతున్న మట్టి



ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లిలో గ్రావెల్ మట్టిని టిప్పర్‌లోకి లోడ్ చేస్తున్న జేసీబీ

ద్వారకాతిరుమల: మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో పచ్చ ముఠా అక్రమ గ్రావెల్ మట్టి తవ్వకాలు దర్జాగా సాగిస్తోంది. గత కొద్దిరోజులుగా టీడీపీ పెద్దల అండదండలతో ప్రభుత్వ భూముల్లో ఈ అక్రమ మట్టి తవ్వకాల దందా జోరుగా సాగుతోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. అదే అదనుగా సదరు టీడీపీ నేతలు రెచ్చిపోయి మరీ రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఈ అక్రమాలకు పాల్పడుతున్నారు. జేసీబీ సహాయంతో తవ్వకాలు జరిపి, టిప్పర్ల ద్వారా మట్టిని కామవరపుకోట, జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లోని రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలిస్తున్నారు. రియాల్టర్ల నుంచి కాంట్రాక్టులు పొంది మరీ ఈ దందాను దర్జాగా సాగిస్తున్నారు. ఒక్కో టిప్పర్ మట్టిని రూ.5 వేలకు పైగా విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఎవరైనా ఈ అక్రమ తవ్వకాలపై అధికారులకు ఫిర్యాదు చేస్తే, వెంటనే మట్టి తవ్వకాలు ఆగిపోతున్నాయి. కొద్దిసేపటి తరువాత మళ్లీ దందా షరామామూలుగా సాగుతోంది. ప్రభుత్వ భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతుంటే కనీసం ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని స్థానికులు ధ్వజమెత్తుతున్నారు. కూటమి నేతల కనుసన్నల్లో అధికారులు పనిచేయడమే ఇందుకు కారణమని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ అక్రమ మట్టి తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రాణం తీసిన బెదిరింపు

ముదినేపల్లి రూరల్: తల్లిని భయపెట్టేందుకు చేసిన పని వికటించి ఓ బాలుడు ప్రాణాలు కోల్పోయిన ఘటన మండలంలోని వడాలిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బాలుడు (17) రొయ్యల చెరువులపై పనులకు వెళుతుంటాడు. ఈ క్రమంలో చెరువుగట్లపై తిరుగాడే పందికొక్కులను నిర్మూలించేందుకు స్థానికంగా ఉన్న చెరువుగట్లపై బిళ్లలు కొట్టడానికి వెళ్లి మిగిలిన బిళ్లలు వెంట తిరిగి తెచ్చుకున్నాడు. ఈ బాలుడు 10వ తరగతి చదువుతూ మధ్యలో మానివేశాడు. తండ్రి గతంలోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాలుడికి ఒక చెల్లెలు ఉంది. తండ్రి చనిపోవడంతో కుటుంబపోషణ తల్లితో పాటు బాలుడిపై పడింది. బాలుడు చెరువుపై పనులకు వెళుతున్నప్పటికీ కూలి తీసుకోకుండా మద్యానికి అలవాటు పడ్డాడు. దీంతో చెరువు పనులకు వెళ్లవద్దని, రంగులు వేసే పనికి వెళ్లి కుటుంబాన్ని పోషించేందుకు సహాయపడాలంటూ తల్లి బాలుడిని గట్టిగా మందలించింది. ఈ మందలింపును జీర్ణించుకోలేని బాలుడు తల్లిని బెదిరించేందుకు వెంట తెచ్చుకున్న మిగిలిన పందికొక్కు బిళ్లల్లో కొన్ని మింగి వెంటనే ఊసేశాడు. తల్లి వెంటనే ముదినేపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే బాలుడు మరణించినట్లు స్థానికులు తెలిపారు. చేతికి అంది వచ్చిన కొడుకు ఇలా అకాల మరణం చెందడంతో ఆ తల్లి కన్నీరుమున్నీరై విలపించింది. కాగా స్థానిక కూటమి నాయకుల చెరువులపై అప్పుడప్పుడు చిన్నపాటి పనులు చేస్తుంటే కూలి ఇవ్వకుండా మద్యం ఇచ్చి సరిపెడుతుండడంతో ఈ పరిస్థితి తలెత్తిందని పలువురు చెబుతున్నారు.

చెక్‌బౌన్స్ కేసులో న్యాయవాదికి జైలుశిక్ష, జరిమానా

నూజివీడు: చెల్లని చెక్కు ఇచ్చిన నేరానికి ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటకు చెందిన న్యాయవాది పెరుమాళ్ల వెంకట సతీష్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.3 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి గురువారం తీర్పు వెలువరించారు. వివరాల ప్రకారం చాట్రాయి మండలం సీ గుడిపాడుకు చెందిన నక్కా శ్రీను 2021 ఏప్రిల్‌లో సతీష్‌కు రూ.5 లక్షలు అప్పుగా ఇచ్చారు. కొంతకాలం తరువాత తన అప్పు తీర్చమని శ్రీను కోరగా 2022 మే నెలలో సతీష్ రూ.2 లక్షలకు చెక్కు ఇచ్చాడు. సతీష్ ఖాతాలో నగదు లేకపోవడంతో బ్యాంకు నుంచి ఆచెక్కు వెనక్కు వచ్చింది. దీనిపై శ్రీను కోర్టులో కేసు వేయగా విచారణ అనంతరం సతీష్‌కు రూ.3 లక్షల జరిమానా, 6 నెలల జైలు శిక్ష విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు.

సొమ్ముల మాయంపై ఖాతాదారుల ఆందోళన

ముదినేపల్లి రూరల్: బ్యాంకు ఖాతాల్లో నిల్వ ఉన్న తమ సొమ్ములు తగ్గడంపై ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై బుధ, గురువారాల్లో స్థానిక స్టేట్ బ్యాంక్‌కు దాదాపు 100 మంది వరకు తరలివచ్చిన ఖాతాదారులు మేనేజర్‌ను ప్రశ్నించారు. ఒకరికి రూ.36 వేలు, మరొకరికి రూ.96 వేలు, పలువురికి రూ.వెయ్యి నుంచి రూ.30 వేల వరకు ఖాతాల్లో నిల్వలు తగ్గిపోయాయంటూ మేనేజర్‌కు తెలిపి కారణం చెప్పాలంటూ నిలదీశారు. దీనిపై బ్రాంచ్ మేనేజర్ బీఎస్ సూర్యనారాయణ వివరణ ఇస్తూ స్థానికంగా ఉన్న తమ శాఖ నుంచి ఖాతాల్లో నిల్వలు ఏమి తగ్గించలేదన్నారు. ఖాతాదారులు ఇతర బ్యాంకుల నుంచి రుణాలు పొంది తిరిగి చెల్లించకుంటే ఈ విధంగా జరిగే అవకాశం ఉండవచ్చని తెలిపారు. అయినప్పటికీ దీనిపై ఉన్నతాధికారులకు సమాచారమందించి తగిన కారణాలు తెలియజేస్తామన్నారు.

ముందుకు లాక్కొచ్చిన మృత్యువు

- చోదిమెళ్ల వద్ద హైటెక్ బస్సుకు జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి
- భీమడోలులో విషాదఛాయలు




మృతుడు బొంతు భీమేశ్వరరావు (ఫైల్)

భీమడోలు: అప్పటి వరకు ప్రైవేటు బస్సులో వెనుక సీటులో కూర్చొన్న వ్యక్తి స్వగ్రామం దగ్గర పడుతుండడంతో ముందు సీటు ఖాళీ అవ్వగా అక్కడకు వచ్చి కూర్చున్నాడు. అంతలోనే హైటెక్ బస్సుకు జరిగిన ప్రమాదంలో అతడిని మృత్యువు కబళించింది. చోదిమెళ్ల వద్ద గురువారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని హైటెక్ బస్సు ఢీకొన్న ప్రమాదంలో భీమడోలు గ్రామానికి చెందిన బొంతు భీమేశ్వరరావు(43) మృతి చెందాడు. జీవనోపాధి నిమిత్తం రెండు నెలల క్రితం భీమేశ్వరరావు హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ పెయింటింగ్ పనులు చేసుకుంటూ కుటుంబ పోషణ చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతని భార్య, ఇద్దరు పిల్లలు భీమడోలులో నివాసముంటున్నారు. ఈ క్రమంలో ఈనెల 8, 9వ తేదీల్లో 12 ఏళ్ల కొకసారి వచ్చే భీమడోలు జాతర వేడుకల్లో పాల్గొనేందుకు భీమేశ్వరరావు బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి రావులపాలెం వెళ్లే ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఎక్కాడు. తెల్లవారితే తన కుటుంబ సభ్యులను కలుసుకుని సంతోషంతో గడపాలని భావించాడు. ట్రావెల్ బస్సులో అప్పటి వరకు వెనుక సీటులో కూర్చున్న భీమేశ్వరరావు హనుమాన్ జంక్షన్ వద్ద ముందు సీటు ఖాళీ అవ్వడంతో వెనుక ఉన్న అతను ముందు సీటులో కూర్చున్నాడు. చోదిమెళ్ల వద్దకు వచ్చేసరికి బస్సు ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో భీమేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరో ముగ్గురు మృతి చెందగా బస్సులోని 21 మంది గాయాలపాలయ్యారు. భీమేశ్వరరావు మృతితో భీమడోలులో విషాద ఛాయలు అలుముకున్నాయి.

చంద్రబాబువి చవకబారు రాజకీయాలు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు



జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ నేతలు, మద్దతుదారులకు ఎటువంటి పనులు చేయవద్దంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు చవకబారు రాజకీయాలకు నిదర్శనమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు అన్నారు. జంగారెడ్డిగూడెంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వైఎస్సార్ సీపీకి సుమారు 1.33 కోట్ల మంది మద్దతిచ్చారని, వారందరికీ సంక్షేమాన్ని ఆపేస్తారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థ ద్వారా కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా సమానంగా సంక్షేమాన్ని అందించి ప్రజలందరి మెప్పు పొందారన్నారు. ప్రస్తుతం చంద్రబాబు వ్యాఖ్యలు చూస్తుంటే రాష్ట్రం 30 నుంచి 40 ఏళ్లు వెనక్కి పోయేలా ఉందన్నారు. ఫ్యాక్షన్ రాజకీయం తీసుకువచ్చి కులాలు, పార్టీల మధ్య చిచ్చుపెట్టవద్దని హితవు పలికారు. సూపర్ సిక్స్‌ను అమలు చేసి ఎన్నికల సమయంలో కూటమి నాయకులు చెప్పిన మాటలను నిజం చేసి, వారి మనోభావాలు కాపాడాలని సూచించారు. తాము సూపర్‌సిక్స్ గురించి మాత్రమే మాట్లాడతామని, అంతకు మించి తమకేమీ అక్కర్లేదని జెట్టి అన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

భీమవరం (ప్రకాశం చౌక్): విద్యుదాఘాతానికి గురై ఒక వ్యక్తి మృతి చెందాడు. భీమవరం టూటౌన్ ఎస్సై రెహమాన్ తెలిపిన వివరాల ప్రకారం భీమవరం రాయలం ఉప్పుగుంటకు చెందిన ఎం.గోవిందరావు (37) గురువారం గొల్లవానితిప్ప రోడ్డులోని ఒక ఇంటి వద్దకు పనికి వెళ్లాడు. అక్కడున్న డ్రెయిన్‌పై రాళ్లు సర్దుతుండగా విద్యుత్ తీగ తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రెహమాన్ తెలిపారు.

జాతీయ లోక్‌అదాలత్‌కు విస్తృత ఏర్పాట్లు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్‌ఏసీ) సునీల్ కుమార్

ఏలూరు (టూటౌన్): ఈనెల 8వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌కు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్ఏసీ), ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.సునీల్ కుమార్ చెప్పారు. స్థానిక జిల్లా కోర్టు నందు గురువారం విలేకరులతో వారు మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్ నిర్వహణ కోసం జిల్లా కోర్టులో 6 బెంచ్‌లు ఏర్పాటు చేయగా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని కోర్టులలో కలిసి 26 బెంచ్‌లు ఏర్పాటుచేసి కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌లో పరిశీలన కోసం 4,453 కేసులను గుర్తించగా వీటిలో 1,815 క్రిమినల్, 2,341 సివిల్ కేసులు, 297 ఎంవీఓపీ కేసులు ఉన్నాయన్నారు. వీటిలో 3,875 కేసులకు సంబంధించి నోటీసులు కూడా జారీ చేశామన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో 2,500 కేసుల పరిష్కారాన్ని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. వివిధ కారణాల వాళ్ల కోర్టుకు రాలేనివారి కోసం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కక్షిదారుల నుంచి వివరాలు తీసుకుని, రాజీకి వారు సిద్ధపడితే కేసుల పరిష్కారం చేస్తామన్నారు. లోక్ అదాలత్‌లలో కేసుల పరిష్కార విధానంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వివిధ శాఖల సిబ్బందితో 69 సమావేశాలు నిర్వహించినట్లు చెప్పారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ మాట్లాడుతూ రాజీ కాదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకుని సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలన్నారు. జిల్లా కోర్ట్ ఆవరణలోని జిల్లా న్యాయ సేవాసదన్‌లో శాశ్వత లోక్ అదాలత్ ఏర్పాటు చేశామని, కోర్టుల పనిదినాల్లో కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారాం పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన



క్షేత్రస్థాయి పర్యటనలో విద్యార్థులు

తాడేపల్లిగూడెం: ఉద్యాన కళాశాల వెంకట్రామన్నగూడెంలో బీఎస్సీ హార్టీకల్చర్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గురువారం పెదతాడేపల్లిలోని ప్రభుత్వ భవనాలను సందర్శించారు. రైతు సేవా కేంద్రం, గ్రామ సచివాలయం, సహకార సంఘం కార్యకలాపాల గురించి విద్యార్థులకు వివరించారు. స్వయం సహాయక సంఘాల పనితీరు గురించి తెలియజేశారు. విద్యార్థుల వెంట ప్రొఫెసర్ ఇ.కరుణశ్రీ, పెద తాడేపల్లి సర్పంచ్ పోతుల అన్నవరం తదితరులు ఉన్నారు.

8న జాతీయ లోక్ అదాలత్



డి.సత్యవతి, నాల్గవ అదనపు జిల్లా జడ్జి

తణుకు అర్బన్: ఈనెల 8వ తేదీన తణుకు కోర్టులో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ అయ్యేక్రిమినల్ కేసులతోపాటు ఎక్సైజ్, చెక్కు బౌన్స్, కుటుంబ సభ్యులతో తగాదా, బ్యాంక్ రికవరీ, ప్రామిసరి నోటు, అన్ని రకాల సివిల్ కేసులు రాజీ చేసుకోవచ్చని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. తణుకు కోర్టులో గురువారం విలేకర్లకు పలు వివరాలు వెల్లడించారు. రాజీయే రాజమార్గమని, కేసులు రాజీ వలన కక్షిదారులు తమ విలువైన సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చని, సివిల్ కేసులలో కోర్టుకు కట్టిన కోర్టు ఫీజు తిరిగి తీసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. 2024 ఏడాదికిగాను మొత్తం 1099 కేసులు రాజీ చేసినట్లు వివరించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



చినతాడేపల్లిలో ప్రమాద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రూరల్ ఏఎస్సై దుర్గారావు

తాడేపల్లిగూడెం రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని మోటార్ సైక్లిస్ట్ మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఏఎస్సై పీవీకే.దుర్గారావు తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఎల్.అగ్రహారం గ్రామానికి చెందిన తిరుపతి వెంకటరమణ (66) మోటారు సైకిల్ (ఏపీ 39 జేడీ 9579)పై కూరగాయల వ్యాపారం నిమిత్తం గురువారం ఉదయం బయల్దేరాడు. తిరిగి మధ్యాహ్నం చేబ్రోలు నుంచి స్వగ్రామం ఎల్.అగ్రహారం వస్తుండగా చినతాడేపల్లి వద్ద జాతీయ రహదారిపై తణుకు నుంచి ఏలూరు వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం వెంకటరమణ మోటారు సైకిల్‌ను ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని మృతుని కుమారుడు ఫోన్ చేసి తన తల్లి వెంకటసూర్యకుమారికి ఫోన్‌లో తెలియజేశాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఏఎస్సై పీవీకే.దుర్గారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు బాగా చదువుకోవాలి



పదో తరగతి విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెంటపాడు: విద్యార్థులు బాగా చదువుకొని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని హెచ్ఎం శారద తెలిపారు. అలంపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్‌డే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు అలరించిన నృత్యాలు ఆకట్టుకొన్నాయి. ఈ సందర్భంగా సీఆర్‌పీ వాసును హెచ్ఎం శారద, ఉపాధ్యాయులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ ఏడు ఉత్తమ ఫలితాలతో నూరుశాతం పాస్ కావాలని హెచ్ఎం శారద ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంతోష్, నరేంద్ర, ఆశాలత, కనకారావు, గణేష్, రమ, బంగార్రాజు, తదతరులు పాల్గొన్నారు.

దేవునికి విధేయులుగా జీవించాలి

పెంటపాడు: దేవునికి విధేయులుగా విశ్వాసులు జీవించాలని పడాల వాక్యజ్యోతి సంఘ వ్యవస్థాపకురాలు ప్రవక్తిని కొమ్మిశెట్టి అమ్మాజీ పేర్కొన్నారు. జట్లపాలెం వాక్యజ్యోతి ఆలయ ప్రాంగణంలో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న వార్షిక అధ్యాత్మిక సమావేశాలు గురువారం రాత్రితో ముగిసాయి. ఈ సందర్భంగా ఆమె రోగుల కోసం ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. యూత్ సంఘ సభ్యులు గీతాలు ఆలపించారు. సువార్త గాయకులు జాషువా గరికి ప్రత్యేక కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా చర్చిసంఘ సభ్యులు, సేవకులు ప్రత్యేక కీర్తనలు ఆలపించారు. బ్రదర్ నవీన్‌కుమార్, బ్రదర్ సత్యకృప పాల్గొన్నారు.

సేవలందక..పథకాలు ఇవ్వక!

ఒకరికి పేరు వస్తుందనే కోపంతో ఎలాగైనా సరే లేకుండా చేస్తే చాలు అనుకుంటోంది కూటమి ప్రభుత్వం. కూటమి నాయకుల అహం చల్లారుతుందనుకోవచ్చేమో కానీ పేద ప్రజల సేవలను అడ్డుకుంటున్నామన్న ఆలోచన మాత్రం వారికి లేదు. కేవలం కల్లబొల్లి మాటలు, అమలుకాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి రావడమే పరమావధిగా పెట్టుకున్నారే తప్ప చేసిందేమీ లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లలో సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పాలన తీసుకెళ్లిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కింది. కానీ నేడు ఏ సేవలూ అందక, ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- నియోజకవర్గంలోని దిష్టిబొమ్మలుగా సచివాలయాలు
- కూటమి ప్రభుత్వంలో నేటికీ తెరుచుకోని ప్రభుత్వ సేవలు
- రేషన్‌కార్డులు, ఇళ్ల పట్టాలు ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలో తెలియక అర్థం కాని స్థితిలో ప్రజలు



అత్తిలి మండలం తిరుపతిపురం గ్రామ సచివాలయం

అత్తిలి: మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం స్థాపనే లక్ష్యంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్లెల అభివృద్ధికి పెద్దపీట వేశారు. ప్రజల వద్దకే పాలనే ధ్యేయంగా గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి దేశ చరిత్రలో సరి కొత్త విప్లవం తీసుకొచ్చారు. మండల కేంద్రాలకు వెళ్లకుండా ఉన్న గ్రామంలోనే సచివాలయాల్లో అన్ని సేవలూ అందేలా చర్యలు తీసుకుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం..కానీ కూటమి ప్రభుత్వం అంతకంటే మరింతగా ప్రజల వద్దకే పాలన సాగిస్తామంటూ కల్లబొల్లి హామీలతో అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థను పక్కన పెట్టి ప్రజల సేవలకు కోతలు పెట్టింది. ప్రజలకు అవసరమైన రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీకార్డులు, అన్నదాత సుఖీభవ వంటి వైబ్‌సెట్లు ఇప్పటికీ తెరుచుకున్న పాపాన పోలేదు. ప్రజలు ప్రస్తుతం కుల, ఆదాయ ధ్రువపత్రాలు వంటి వన్‌బీ వంటి సాధారణ సేవలు మాత్రమే పొందుతున్నారు. దీంతో ప్రజలు కూటమి ప్రభుత్వం తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ సేవలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని తణుకులో గ్రామాల్లో పెద్ద ఎత్తున విమర్శలు చేస్తున్నారు. కేవలం టీడీపీ సభ్యత్వం మాత్రమే చురుకుగా సాగుతోందని ఎద్దేవా చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలా...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పల్లెలలోనే సేవలు అందజేసేందుకు ప్రతి గ్రామంలోనూ సచివాలయా న్ని ఏర్పాటు చేసి అనుసంధానంగా 50గృహాలకు ఒక వలంటీర్‌ను నియమించి అన్ని సేవలకూ ప్రజలకు నేరుగా అందజేశారు. ఒక్కో సచివాలయ భవనాన్ని రూ.45లక్షలు వెచ్చించి నిర్మించారు. ప్రజలు తమకు వీలున్నప్పుడే సమస్యలు విన్నవించుకునేందుకు సచివాలయాలు ఎంతో ఉపయోగపడేవి. సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్, విద్యుత్ తదితర సేవలు వివిధ ధ్రువపత్రాలు అస్తుల రిజిస్ట్రేషన్లు, ఆధార్ సేవలు పల్లెలోనే పొందేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఈ సేవలు కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాలు వెలవెలబోయాయి. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థను పక్కన పెట్టిన కూటమి ప్రభుత్వం ఉద్యోగులను సైతం తగ్గిస్తోంది.

రేషన్‌కార్డు కోసం ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలి

ఏదైనా పనులు కావాలంటే ఒకప్పుడు సచివాలయంలో పొందేవాళ్లం. ఇంటికి వచ్చి మరీ వలంటీర్లు అందజేసేవారు. ఇప్పుడు ఏవైనా పథకాలు కావాలంటే ఏమి చేయాలో ఎవరిని అడగాలో తెలియడం లేదు. రేషన్‌కార్డు కోసం ఎవరిని అడిగినా తమకేమి తెలియదు అంటున్నారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి



గ్రామాల్లో ఏర్పాటైన సచివాలయాలతో గత ప్రభుత్వంలో ప్రజలకు విస్తృతమైన సేవలు అందేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాదిరిగానే ఇప్పుడు కూడా గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ సేవలను సచివాలయల ద్వారా కొనసాగించాలి. గతంలో వలంటీర్లు ఇంటికే వచ్చి సంక్షేమ పథకాలు, సర్టిఫికెట్లు వంటి సేవలు అందించేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వ తక్షణమే సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలి.

కంకటాల సతీష్, ద్వారకా తిరుమల దేవస్థానం ట్రస్టుబోర్డు మాజీ సభ్యుడు, అత్తిలి.

ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం శ్రద్ధ చూపాలి



గ్రామ సచివాలయ, వలంటీర్ల సేవలు కొనసాగించాలి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 9 నెలలు కావొస్తున్నా ప్రజలకు ఎలాంటి పథకాలు అందడం లేదు. రేషన్‌కార్డులతో పాటు పింఛన్ దరఖాస్తు వెబ్‌సైట్లు తెరచి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలి.

బుడితి సుజన్‌కుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా దివ్యాంగ విభాగం అధ్యక్షుడు, అత్తిలి.

ఘనంగా బాబా ఆలయ వార్షికోత్సవం



సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

పెంటపాడు: మండలంలోని అలంపురం గ్రామంలో గణపతి దత్తాత్రేయ సహిత షిర్డీ సాయిబాబా ఆలయ 19వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కొలనువాడ పెదకృష్ణంరాజు ఆధ్వర్యంలో భక్తులు తెల్లవారు జాము 3 గంటలకు సామూహిక గీతా పారాయణం, కాకడ హారతి, దేశంలోని 8 పుణ్యనదులతో తెచ్చిన జలాలతో స్వామివారి అభిషేకం, విశేష అభిషేకాలు, 6 వేల మందికి భారీ అన్నసమారాధనతో పాటు, బాబాకు పల్లకీ గ్రామోత్సవం, సంధ్య హారతి, దువ్వకు చెందిన వెంకటేశ్వరకోలాట నృత్యప్రదర్శన నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు బాబా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

తాడేపల్లిగూడెం (టీటీసీ): నియోజకవర్గంలోని తాడేపల్లిగూడెం టౌన్, పెంటపాడులలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. టౌన్‌లోని శ్రీ వాసవి, ఆదిత్య, జీఎంఆర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డీఆర్ గోయెంకా ఉమెన్స్ జూనియర్ కళాశాలలోను, అదే విధంగా పెంటపాడు జూనియర్ కళాశాలలో గురువారం ప్రథమ సంవత్సరం పరీక్షలు జరిగాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరిగింది. 2,484 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 2414 మంది పరీక్షలకు హాజరయ్యారు. 70 మంది పరీక్షలు రాయలేదు. ఛీఫ్ సూపరింటెండెంట్, డిపార్టమెంటల్ ఆఫీసర్లు పర్యవేక్షించారు.

ప్రజా సమస్యలపై పోరాడాలి



తణుకులో మారిశెట్టి శేషగిరిని అభినందిస్తున్న మాజీమంత్రి కారుమూరి

తణుకు అర్బన్: సౌమ్యుడు, నిబద్ధతతో పనిచేసే తత్వమున్న మారిశెట్టి శేషగిరిని పార్టీ శ్రేణులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం అభినందనీయమని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీ కోసం పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని రెండుసార్లు కౌన్సిలర్‌గా బాధ్యతలు నిర్వర్తించి ప్రజల సమస్యల పరిష్కారానికి నోచుకున్న శేషగిరి అందరితోను కలుపుగోలుగా వెళ్లేతత్వం ఉన్న వ్యక్తి అన్నారు. పట్టణ ప్రాంతంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి మాట్లాడుతూ మాజీమంత్రి కారుమూరి, పార్టీ శ్రేణులు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ కోసం కష్టపడతానని, రానున్న రోజుల్లో ప్రజలకు అండగా నిలబడి పార్టీ చేసే కార్యక్రమాల్లో అందరినీ కలుపుకుని ముందుకు వెళ్తానని చెప్పారు. అనంతరం శేషగిరిని మాజీ మంత్రి కారుమూరి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా సెక్రటరీ ఆర్గనైజేషన్ యిండుగపల్లి బలరామకృష్ణ, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పొట్ల సురేష్, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ మారిశెట్టి శివశంకర్, ప్రచార కమిటీ తణుకు నియోజకవర్గ అధ్యక్షుడు ఫణీంద్ర కుమార్ వీరమల్లు, నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు మెహర్‌అన్సారీ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షురాలు షేక్ ఫహీమా, వి.సీతారాం, కర్రి గంగాధర అప్పారావు, పుల్లెపు సూర్యచంద్రరావు, ఝాన్సీ లారెన్స్, గంజి సతీష్, గారపాటి సత్యనారాయణ, పార్థసారధి, వై.రామకృష్ణ, చింతాడ సంజీవరావు పాల్గొన్నారు.

కొత్త తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం



యూనియన్ బ్యాంకు జిల్లా సమావేశం దృశ్యం

తాడేపల్లిగూడెం: చైతన్యవంతమైన వ్యాపార, వాణిజ్య వర్గాలకు, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం అందజేయడంలో యూనియన్ బ్యాంకు ముందు వరుసలో ఉంటుందని యూనియన్ బ్యాంకు ఏలూరు రీజియన్ మెగా ఎంఎస్ఎంఈ అవుట్‌రీచ్ ప్రోగ్రాంలో జనరల్ మేనేజర్ రమణ తెలిపారు. సమావేశంలో పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం జరిగింది. ముఖ్యఅతిధిగా పాల్గొన్న రమణ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ వికసిత భారత్ లక్ష్యం సాధనలో బ్యాంకు ముందుకెళుతుందన్నారు. ఎంఎస్ఎంఈ పరిశ్రమలను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఇతోధికంగా రుణాలు అందజేస్తున్నామన్నారు. పరిశ్రమలు స్థాపించడం, రుణాలు తీసుకోవడం, తిరిగి చెల్లించడం వంటి విషయంలో ఖాతాదారులు, ఔత్సాహికుల్లో చైతన్యం తీసుకురావడానికి గడచిన వారం రోజులుగా ఏలూరు రీజియన్‌లో అవుట్ రీచ్ కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. జిల్లాలో వ్యాపారపరంగా తాడేపల్లిగూడెం పట్టణానికి ఓ బ్రాండ్ ఇమేజ్ ఉందన్నారు. ఇక్కడి వ్యాపారులు చైతన్య వంతులన్నారు. వాణిజ్య వికేంద్రీకరణ జిల్లాలో జరిగినప్పటికి, ఇక్కడ నూతన వ్యాపార కార్యకలాపాలు పెరుగుతున్నాయి. ఏలూరు రీజియన్‌లో అంతర్భాగంగా ఉన్న ఏలూరు జిల్లా, పశ్చిమగోదావరి జిల్లా, తూర్పుగోదావరి జిల్లాల్లో ఇప్పటి వరకు రూ.9,419 కోట్ల వ్యాపారం చేయడం జరిగిందని రీజినల్ ఆఫీస్ హెడ్ నాంపల్లి శ్రీనివాసు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ హెడ్‌లు ఎస్.కిరణ్‌కుమార్, సంతోష్ సాకేత్, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ ఏ.నాగేంద్రప్రసాద్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం మంగపతిరావు, వివిధ బ్యాంకు మేనేజర్లు, వ్యాపార సంస్థల ప్రతినిధులు, అసోసియేషన్ల బాధ్యులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



ఉప్పరగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ సమావేశ దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పార్టీ ఆదేశాలను శిరసావహించి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని ఉప్పరగూడెం, దండగర్ర, జగన్నాథపురం గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలన్నారు. క్షేత్ర స్థాయి ప్రజల సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించాలన్నారు. ప్రజలకు తాము ఉన్నామనే భరోసా కల్పించాలని సూచించారు. అనంతరం గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, ముళ్లపూడి రామకృష్ణ, ర్యాలీ తాతయ్య, కొండయ్య, పత్సా బేబిరాణి, దండే చినగోతియ్య, గజ్జల నాగరాజు, దాకే పండియ్య, మరపట్ల యోహాను, నత్తా రాజు, మండ మోషేను, ఏలూరి వెంకటేశులు, ఊబా వెంకన్న, పోలిమాటి రత్నరాజు, ఉప్పరగూడెం గ్రామ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

400 పాడి పశువులకు టీకాలు



జగ్గన్నపేట గ్రామంలో పాడి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో గురువారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి 328 గేదెలు, 72 ఆవులకు టీకాలు వేశారు. అనంతరం మండల పశువైద్యాధికారి టీవీ.విజయ్‌కుమార్ మాట్లాడుతూ పాడి రైతులు విధిగా తమ పశువులకు టీకాలు వేయించాలని, లేని పక్షంలో నోటీ పుండ్లు, గిట్టలకు, పొదుగుపై పుండ్లు వచ్చి పాల దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. నాలుగు నుంచి ఆరు నెలల పెయ్యి దూడలకు భవిష్యత్‌లో గర్భస్రావం కాకుండా బ్రూసెల్లోసిస్ వ్యాధి టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవో హేమలత, పశుసంవర్థక శాఖ సహాయకులు చంద్రశేఖర్, అనిల్, ప్రసాద్, శ్రీనివాస్, మురళీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేఎస్‌డీ కళాశాలలో జాతీయ సదస్సు



తణుకులో సదస్సులో మాట్లాడుతున్న ఆదికవి నన్నయ యూనివర్శిటీ రిజిస్ట్రార్ జి.సుధాకర్

తణుకు అర్బన్: తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో వ్యాధికారక స్వేచ్ఛ సూక్ష్మజీవులపై ఔషధ ఆవిష్కరణ, రోగ నిర్ధారణ సాధనాలపై అవగాహన సదస్సు అనే అంశంపై రెండురోజుల జాతీయ సదస్సు గురువారం ప్రారంభించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన రాజమండ్రి ఆదికవి నన్నయ యూనివర్శిటీ రిజిస్ట్రార్ జి.సుధాకర్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వైద్యరంగంలోను, ఔషధ రంగంలోను ప్రముఖ పాత్ర పోషిస్తుందని అన్నారు. శరీరం వ్యాధి నిరోధక శక్తిని ఏవిధంగా తయారు చేసుకుంటుందో జన్యు పరీక్షలు నిర్వహించుకోవడం వలన ఏ మందులు మనకు ఉపయోగపడతాయో తెలుస్తుందని, కోవిడ్ సమయంలో వ్యాధి నిరోధక టీకాలు ప్రముఖ పాత్ర పోషించిన విషయం అందరికీ తెలిసిందేనని చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన క్రోమోజెనిక్ లైఫ్ సైన్స్ మేనేజరు డాక్టర్ ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ వైరస్, బ్యాక్టీరియా మనిషిని ఏవిధంగా ప్రభావితం చేస్తాయో, ఎక్కువ మొత్తంలో యాంటిబయాటిక్స్ వాడితే మూత్రపిండాలు పాడవుతాయని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ యు.లక్ష్మి సుందరీబాయ్, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, డాక్టర్ కె.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఎఫ్‌లో ఐటీ దాడుల కలకలం

పెంటపాడు: ప్రత్తిపాడు ట్రిపుల్ కర్మాగారంలో ఐటీ దాడుల కలకలం రేగింది. గురువారం మధ్యాహ్నం నుంచి కర్మాగారంలో ఈ దాడులు జరుగుతున్నట్లు తెలిసింది. ఏలూరు రీజియన్‌కు చెందిన ఐదుగురు ప్రత్యేక బృంద సభ్యులు ఫ్యాక్టరీలో పలు విభాగాలు పరిశీలనలో చేసినట్లు సమాచారం. ఈ సమాచారం తెలుసుకొనేందుకు ప్రయత్నించగా లోపలికి వెళ్లేందుకు యాజమాన్యం అనుమతి లభించలేదు.

విశ్వాసం ద్వారానే ఆధ్యాత్మికత

పెంటపాడు: దేవునిలో విశ్వాసముంచితేనే ఆధ్యాత్మిక అభివృద్ధి సాధ్యమని ఆకివీడుకు చెందిన బీపీఎఫ్ డైరెక్టర్ శామ్యూల్ ఏసురత్నం పేర్కొన్నారు. మండలంలోని మౌంజీపాడు గ్రామంలో సియోను రారాజు ప్రార్ధనా మందిరంలో మూడు రోజుల ఉజ్జీవ సమావేశాల్లో భాగంగా సంఘకాపరి నంద్యాల రూతమ్మ ఆధ్వర్యంలో జరుగుతున్న సభలు గురువారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సేవకులు, విజయవాడ బైబిలు చర్చికి చెందిన రతన్‌శామ్యూల్, మందపాడుకు చెందిన జోసఫ్, మచిలీపట్నంకు చెందిన వైఎస్ సంగీతరావు, ఏలూరుపాడుకు చెందిన టి. భాగ్యరాజు, అమలాపురంకు చెందిన టి. రాహుల్, కాటూరుకు చెందిన వి. జయకిషోర్ తదితరులు దేవుని వాక్యం బోధించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంఘ విశ్వాసులు, యూత్ సంఘ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

త్యాగరాజ కీర్తనలు



బీవీఆర్‌లో సంగీత కచేరీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలో బీవీఆర్ కళా కేంద్రంలో కళాకేంద్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు ఆధ్వర్యంలో 84వ అరాధనోత్సవాలు గురువారం కొనసాగాయి. బీవీఆర్‌లో భారతరత్న ఎం.ఎస్.సుబ్బలక్ష్మి కళా వేదిక వారిచే గురువారం రాత్రి సంగీత కచేరీ జరిగింది. వల్లూరి తుషార పూర్ణవల్లి (విజయవాడ)వారిచే సంగీత కచేరీ జరగగా, వైలన్‌పై కురపాటి సుబ్రహ్మణేశ్వరరాజు (విజయవాడ), మృదంగం పై పలివెల విద్యాసాగర్ (హైదరాబాద్), ఘటంపై బి.మారుతీ రఘురాం (తిరుపతి)లు సహకరించారు. తొలుత తిరుపతి సంగీత కళాశాలలో ఎంఏ మ్యూజిక్ పూర్తి చేసిన చిక్కాల సుస్మిత కార్ణటక సంగీతం కచేరీ జరిగింది. ఈ కార్యక్రమంలో త్యాగరాజు గాన సభ అధ్యక్షులు గరికిపాటి బాపయ్య శర్మ కార్యదర్శి సరస్వతుల హనుమంతరావు, బీజేపీ నాయకులు కర్రి ప్రభాకర్ బాలాజీ, కళాకారులు కోపల్లె శ్రీనివాస్, కళా కేంద్రం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎస్ సునీల్‌కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని ధర్నా



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): దళిత ఐపీఎస్ అధికారి సునీల్‌కుమార్‌పై సస్పెన్షన్ విధించడాన్ని దళిత జేఏసీ సంఘాల సభ్యులు ఖండించారు. గురువారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన నిరసన ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా సునీల్‌కుమార్‌ను సస్పెండ్ చేయడం దారుణమని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. విల్లింగ్ ఇచ్చిన రెండోరోజున సస్పెండ్ చేయడం దళిత జాతిని అవమానించినట్లేనని, రాబోయే రోజుల్లో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సునీల్ కుమార్ సస్పెన్షన్ ఎత్తివేసి వెంటనే పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బహుజన సేన అధ్యక్షుడు గుంపుల సత్యకృష్ణ, దళిత మహాసభ నాయకులు ఆంధ్రు లక్ష్మణ్‌రావు, అంబేద్కర్ ఇండియా మిషన్స్ నాయకులు బత్తుల శివకృష్ణ, పట్టణ నాయకులు తాడేపల్లి శ్యాంబాబు, మరపట్ల రాజు, విప్పర్తి ప్రసాద్‌రావు, నాని తదితరులు పాల్గొన్నారు.